


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు


గరుత్మంతుడిపై విహరిస్తున్న ప్రహ్లాద వరదస్వామి



- దిగువ అహోబిలంలో అట్టహాసంగా గరుడోత్సవం
- దిగువలో ముగిసిన అహోబిలేశుని బ్రహ్మోత్సవాలు
- నేత్రపర్వంగా ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవం
- పున్నమి వెన్నలలో పడవపై విహరించిన ఆది దంపతులు

నమో అహోబిలేశా..!

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రహ్లాద వరద గోవిందా.. గోవింద, లక్ష్మీనృసింహస్వామి గోవిందా.. గోవింద అంటూ భక్తులు పారవశ్యంతో స్తుతిస్తుండగా ప్రహ్లాదవరదుని గరుడోత్సవం కన్నులపండువగా సాగింది. పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, పూలమాలలతో అలంకృతుడైన ప్రహ్లాద వరదస్వామి గరుత్మండిపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అహోబిలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదునికి గరుడోత్సవ సేవ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కమనీయ వేడుక శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగింది. గరుడసేవ సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని చోళ సింహపురం యోగా నృసింహస్వామి దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పుష్పమాలలు, చీరసారెలను సమర్పించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు భారీగా తరలిరావడంతో దిగువ అహోబిల క్షేత్రం ఆధ్యాత్మికతతో ఓలలాడింది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు. సకల దేవతలకు, అష్టదిక్పాలకులకు వీడ్కోలు చెబుతూ ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన గరుడ పటాన్ని కిందికి దించారు. వేదమంత్రాలను పఠిస్తూ దిగువ అహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ముగించారు.

● తెప్పోత్సవం చూసిన కనులదే భాగ్యం :

దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సాంప్రదాయబద్ధంగా పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం, మంగళ హారతి నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఆళ్లగడ్డ ఏడీఈ రవికాంత్ చౌదరి, హిమబిందు దంపతులు ఉభయదారులుగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలతో స్వామి, అమ్మవార్లకు ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ కోనేటి వరకు తీసుకొచ్చారు. ఉభయ దేవేరులతో తెప్పలో కొలువైన ప్రహ్లాద వరదస్వామి కోనేటిలో శోభాయమానంగా విహరించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా, భక్తులు నారసింహ కీర్తనలు ఆలపిస్తుండగా పున్నమి వెన్నెలలో ఆది దంపతులు తెప్పపై తిరుగాడారు. వందలాది మంది భక్తులు కోనేటి చుట్టూ చేరి ప్రహ్లాద వరదుని తెప్పోత్సవాన్ని కనులారా వీక్షించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపా లన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఈ వేడుకలను పర్యవేక్షించారు.

ఏపీపీఎస్సీ పరీక్షకు 144 మంది గైర్హాజరు


ఓ అభ్యర్థి పరీక్షకు ఆలస్యంగా రావడంతో గేటు మూసివేసిన సిబ్బంది


అభ్యర్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న పరీక్షా సిబ్బంది

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఏపీపీఎస్సీ నిర్వహించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షకు 144 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. నంద్యాల శ్రీనివాస నగర్‌లోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 99 మంది అభ్యర్థులను కేటాయించగా 51 మంది హాజరయ్యారు. అలాగే ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు వంద మంది అభ్యర్థులను కేటాయించగా 48 మంది హాజరయ్యారు. పాణ్యం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు వంద అభ్యర్థులను కేటాయించగా 47 మంది హాజరయ్యారు. మొత్తం 144 మంది గైర్హాజరయ్యారు.

● ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి...

పరీక్షను 9.00 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. 8.45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 9 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌గా నిర్ణయించారు. నంద్యాల పట్టణం జ్ఞానాపురం కాలనీ చెందిన కోడూరుకార్తీక్ 9.15గంటలకు రామకృష్ణ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో అప్పటికే గేట్లు మూసివేశారు. పరీక్షా సిబ్బందిని, పోలీసులను బతిమిలాడినా అనుమతించలేదు.

ఎండలే అసలు సమస్య

● నేటి నుంచి 'పది' పరీక్షలు ● జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



నంద్యాల ఎడ్యుకేషన్/ కొలిమిగుండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే విద్యార్థులకు ఎండలే అసలు సమస్యగా మారాయి. ఈ ఏడాది ముందస్తుగానే భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 130 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు రాయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 26,010 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు పూర్తవుతుంది.

అప్రమత్తంగా ఉండటం అవసరం

ఎండా కాలం, అందులోనూ పరీక్షల ఒత్తిడి సమయం కాబట్టి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆహారపు అలవాట్లు, దినచర్య ఉండాలి. ఎక్కువగా నిద్ర మేలు కోవడం, ఒత్తిడి పెంచుకోవడం వంటివి చేయకూడదు. గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరి నీళ్ల వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

- డా.మల్లికార్జునరెడ్డి, కొలిమిగుండ్ల



● పరీక్షా కేంద్రానికి ముందుగా చేరుకోవాలి

ప్రతి విద్యార్థి అరగంట ముందే పరీక్షా సమయానికి ముందుగానే చేరుకొని అక్కడి పరిసరాలను అలవాటు చేసుకోవాలి. దీంతో కొంత మేర కంగారు తగ్గి మనస్సు తేలిక అవుతుంది. సాధన చేస్తూ ఉంటే ఎంతటి క్లిష్టమైన అంశమైనా చాలా సులువుగా గుర్తిండిపోతుంది. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల విజయం మీ సొంతమవుతుంది.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల



● నేనెంత సాధించగలను అనే మానసిక దృక్పదం అలవడాలి

పరీక్షల్లో ఆ మూడు గంటలు మీ మైండ్ సెట్ ఎలా ఉంటుందనేది అతి ముఖ్యమైన విషయం. నేనింతే సాధించగలను అనే మూడ్ నుంచి నేను సాధించగలను అనే గ్రోత్ మైండ్ సెట్‌ను విద్యార్థి అభివృద్ధి చేసుకోవాలి. అది మానసిక శక్తిని, ప్రతిభను మరింత పెంచుతుంది. నేను పరీక్షను విజయవంతంగా రాయగలను అని ప్రతిరోజూ అనుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షా హాలులో ప్రశాంతంగా సమాధానాలు రాయడం వల్ల మెదడు మరింత చురుగ్గా పని చేస్తుంది. మనసు ప్రశాంతంగా ఉండాలంటే శరీరం ప్రశాంతంగా ఉండాలి. దానికోసం డీప్ బ్రీతింగ్ టెక్నిక్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. నాలుగు సెకన్లు లోపలకు శ్వాస తీసుకోవడం, ఏడు సెకన్లు శ్వాసను బంధించడం నెమ్మదిగా వదిలేయడం చేయాలి. దీనివల్ల మెదడులో ఆక్సిజన్ పెరిగి ప్రశాంతతను ఇస్తుంది. రోజూ 20 నిమిషాలు వ్యాయామం లేదా నడక వల్ల మెదడులో ఆక్సిజన సరఫరా మెరుగుపడుతుంది.

- డాక్టర్ గౌతమ్‌రెడ్డి, మానసిక వైద్యనిపుణులు, అమృత న్యూరోక్లినిక్




ఎన్టీఆర్ సుజల స్రవంతిని అడ్డుకున్న జగన్

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి

కొలిమిగుండ్ల, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): జగన్ మోహన్ రెడ్డి హయాం లో నాటి పాలకుల నిర్లక్ష్యంగా కారణంగానే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఆగిపోయిం దని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.3.79 కోట్ల నిధులతో కొలిమిగుండ్లలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి శుద్ధ జల కేంద్రాన్ని ఆదివారం మంత్రి పునఃప్రారంభించారు. ఇటీవల మంత్రి ప్రత్యేక చొరవతో రూ.4లక్షలు వెచ్చించి పథకానికి మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి నుంచి 21 గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినీ మినరల్ వాటర్ ట్యాంకులకు ట్రాక్టర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు మంత్రి బీసీ వెల్లడించా రు. గ్రామాల్లో తాగునీటి కొరత ఎట్టి పరిస్థితుల్లో రానివ్వ మని అన్నారు. మే నెలలో కీలకమైన తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ చేప డతామన్నారు. ఇదిలా ఉండగా మండ లంలో నెలకొ న్న సమస్యలపై ప్రజలు మంత్రి బీసీకి విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఏఈలు కరీముల్లా, సా యికృష్ణ, సీఐ రమేష్‌బాబు, నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మిరెడ్డి, జయలక్ష్మి రెడ్డి, పెట్నికోట హుస్సేన్‌రెడ్డి, ప్రసాద్, వివేకానందరెడ్డి, నాగేశ్వరరెడ్డి, నరసింహుడు, చిన్నపురెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్లను నమ్మొద్దు


ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : నకిలీ వెబ్‌సైట్లను నమ్మొ ద్దని శ్రీశైలం దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. శ్రీశైలం దేవస్థానం వసతి గదులు, ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు ముందస్తుగా పొందేందుకు దేవస్థానం ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించిందని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం పేరుతో కొందరు నకిలీ వెబ్‌సైట్ల ద్వారా సొమ్ము చేసుకుంటున్నారని, భక్తులు అలాంటి వెబ్‌సైట్లను నమ్మవద్దని సూచించారు. శ్రీశైలం దేవస్థానం వసతి గదులు, ఆర్జిత సేవా టికెట్లు స్వామివారి స్పర్శ దర్శనం టికెట్లు, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో పొందేందుకు భక్తులు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.శ్రీశైలం దేవస్థానం.ఓఆర్‌జి లేదా దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ టెంపుల్స్.ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లను మాత్రమే వినియోగించవలసిందిగా దేవస్థానం ఈవో తెలిపారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం	సెహరి మంగళవారం
కర్నూలు	6:31	5:12
నంద్యాల	6:27	5:11

నీళ్లివ్వండి.. మహాప్రభో..!

సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీల ఆందోళన

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : మంత్రి టీజీ భరత్


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నీళ్లివ్వండి మహా ప్రభో అంటూ జడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అంశాలపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రితో పాటు కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, రాజకుమారి గణియా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, ఆలూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, వీరుపాక్షి, జయసూర్య, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, అధికారులు హాజరయ్యారు. ముందుగా పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి టీజీ భరత్, అధికారులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ప్యాపిలి జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సభ్యులంతా నీటి సమస్యపైనే ఎక్కువగా గళం విప్పారు. మద్దికెర, ఓర్వకల్లు, కొత్తపల్లి, వెల్దుర్తి, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, కోడుమూరు, జుపాడుబంగ్లా, నంద్యాల మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని అన్నారు. నంద్యాల మండలంలోని పది గ్రామాల్లో నీటి సమస్య ఉందని ఎంపీపీ, గోస్పాడు మండలంలో రెండు గ్రామాలలో నీటి సమస్య ఉందని, పగిడ్యాలలో చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. జడ్పీటీసీ దివ్య, వెల్దుర్తి మండల కేంద్రానికి తాగునీటి పరిష్కారం కోసం బ్రహ్మగుండం నుంచి మరో పైప్‌లైన్ వేయాలని జడ్పీటీసీ సుంకన్న, కొత్తపల్లి మండలం బావురం, లింగాపురం గ్రామాల్లో నీటి వృథాను అరికట్టాలని, చేతి పంపులు రిపేరీ చేయాలని విన్నవించారు. మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

-మిగతా 7లో...

పురపాలక సంఘము, నంద్యాల

ఆర్.ఒ.సి.నెం.301/2015/A1 **పత్రిక ప్రకటన** తేదీ : .03.2025

ఇందుమూలముగా యావన్మంది పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నంద్యాల పురపాలక సంఘము ఆధీనం నందు గల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్ తేది: 25-03-2025న ఉదయం 10:30గం॥లకు మరియు షాపింగ్ కాంప్లెక్స్‌ల లోని ఖాళీగా వున్న షాపు రూములను తేది: 25-03-2025న 11:30గం॥లకు పురపాలక సంఘ కార్యాలయం నందు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని తెలియజేయడమైనది.

వేలములు నిర్వహించు మున్సిపల్ మార్కెట్ వివరములు:

వనెం.	షాపు రూములు / మార్కెట్ వివరములు	లీజు కాలము
1.	డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్	01-04-2025 నుండి 31-03-2026 అర్థరాత్రి వరకు.
2.	మాంసం మరియు చేపల మార్కెట్లు	
3.	పశువుల సంత	

వేలములు నిర్వహించు మున్సిపల్ షాపు రూముల వివరములు:

వనెం.	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు రూము నెం.
1.	పాత మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	1N(FF), 4N-5N(FF), 6N-7N(FF), 8N-9N(FF)
2.	మునిసిపల్ హైస్కూలు దగ్గర	8(FF-ST), 11-12 (FF)
3.	ఆర్.ఎఫ్.రోడ్	1,2,3
4.	సత్రంబడి	01, 05 (FF), 06 (FF)
5.	గర్ల్స్ హైస్కూల్ ప్రక్కన	03, 04, 08(FF), 09(FF)

సదరు బహిరంగ వేలమునందు పాల్గొనదలచిన వారు ఇతర వివరముల కొరకు మునిసిపల్ కార్యాలయములోని రెవెన్యూ విభాగము నందలి ఎ1 గుమాస్తను కార్యాలయపు పని వేళలలో సంప్రదించగలరు మరియు పాటలో పాల్గొనదలచినవారు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీని కార్యాలయములోని ఎ1 గుమాస్తకు అందజేయవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- కమీషనర్, నంద్యాల పురపాలక సంఘము, నంద్యాల.

నీళ్లివ్వండి మహా ప్రభో

- సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీల ఆందోళన
- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- మంత్రి టీజీ భరత్



సమావేశంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారి, జేసీ డాక్టర్ బి.నవ్య

(5వ పేజీ తరువాయి)

మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను కాపాడాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగాన్ని కాపాడి వలసలు వెళ్లకుండా నివారించాలని కోసిగి జడ్పీటీసీ పాటిల్ కోరారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కొత్తపల్లి జడ్పీటీసీ కోరారు. మినుము పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. చెరువుల్లో మట్టిని తొలగించి మరమ్మతులు చేపట్టాలని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న కోరారు.

- అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యేలు సమావేశం మధ్యలో వెళ్లిపోవడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యే, జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున సమస్యలను విన్నవించేందుకు వస్తే మధ్యలో ఎలా వెళ్లి పోతారని కొందరు జడ్పీటీసీలు మండిపడ్డారు. జిల్లా పరిషత్ చైర్మన్‌పై ఇరిగేషన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ డీఈ లేచి చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత చేసినా తమ శాఖ గురించి తప్పుగా మాట్లాడవద్దని వారిం చారు. ప్రభుత్వం ఆదేశాలు రాకపోతే తాము ఎలా పని చేస్తామని ఖరాఖండిగా చెప్పేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు మూడు రాష్ట్రాలకు సంబంధించి ఉంది. అలాంటప్పుడు ఇరిగేషన్ అధికారులు ఒక్కరిదే తప్పు అనడం సబబు కాదన్నారు.

పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి



జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉంది. ఈ ప్రాంతంలో నీరందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి. కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లో నీటి సమస్య తీర్చడ కోసం ఎంపీ నిధుల నుంచి రూ.60 కోట్లు ఇచ్చాం. ఆస్పరి వద్ద అలారుదిన్నె బ్రిడ్జి వద్ద హెచ్‌ఎస్‌ఎస్ నుంచి మూడు టీఎంసీల నీటి కేటాయింపు గాజులదిన్నె ప్రాజెక్టుకు ఉంది. పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న హట్టేకల్, పుప్పాలదొడ్డి, బిల్లేకల్లు గ్రామాలకు నీటి సమస్య తీరుతుంది. గాజులదిన్నె ప్రాజెక్టుకు కోడుమూరు చాలా దగ్గరగా ఉంది. కోడుమూరు నీరు రావడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. జీడీపీ నుంచి నంద్యాల జిల్లా డోన్‌కు రూ.82 కోట్లు ఖర్చు చేసి నీటిని తీసుకెళ్లారు. కోడుమూరుకు శాశ్వత నీటి సమస్యను పరిష్కరించాలి. పాణ్యం ఎమ్మెల్యే గుండ్రేవుల ప్రాజెక్టుపై శాసనసభలో లేవనెత్తడం వల్ల చర్చ జరిగింది. అదేవిధంగా వేదవతి ప్రాజెక్టుపై కూడా అసెంబ్లీలో చర్చ జరగాలి. ఈ క్రమంలో నీటి సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి. **- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ**

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. గ్రామాల్లో నీటి సమస్యను తీర్చడానికి గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలి, జడ్పీ నుంచి సాధ్యమైనంత వరకు నిధులను సమకూరుస్తాం. గ్రామాలలో చేతి పంపులను వినియోగంలోకి తీసుకురావాలి. రబీలో ఎరువుల కొరత వచ్చింది. వచ్చే ఖరీఫ్‌లో ఎరువుల కొరతల లేకుండా చర్యలు తీసుకోవాలి. కృష్ణా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఈ ప్రాంతంలో రిజర్వాయర్లు నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. **- ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ చైర్మన్**

ఆరు మండలాల్లో నీటి సమస్య : ఎమ్మెల్యే విరూపాక్షి



ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నీటి సమస్య ఉంది. ఆలూరులో చెరువు అన్యాక్రాంతం కాకుండా రిజర్వాయర్ నిర్మించాలి. హొళగుంద మండలం పక్కనే ఎల్లెల్సీ ఉన్నా నీటి సమస్య తీవ్రంగా ఉంది. దేవనకొండ మండలం బండకుంటలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలి. వెంకటాపురంలో బోర్లు రిపేరి చేయించాలి. పందికోన నుంచి నీటి సరఫరా చేయిం చాలి. సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యేలు మధ్యలో వెళ్లిపోతే ఎవరు సమాధానాలు చెప్పాలి?. జడ్పీటీసీలు, ఎంపీపీలు పనిపాట లేకుండా సమావేశానికి వస్తారా. తాగునీరు.. .వ్య వసాయం, ఇరిగేషన్‌పై కర్నూ లు ఎంపీ సమా ధానం చెప్పాలి. రైతుల ఆత హత్యలపై ప్రభుత్వం తరపున మంత్రి సమాధానం చెప్పకుండా వెళ్లిపోతే ఎలా? ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఒక్కో మండలానికి తాగునీటి అవసరాలకు రూ.50 లక్షలు కేటాయించాలి.

- విరుపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

మద్దతు ధర అంశం కేంద్ర దృష్టికి : కలెక్టర్ రంజిత్ బాషా



మిర్చికి మద్దతు ధర అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కందులు ఆదోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌కు రాకముందే గ్రామాలలో నాణ్యతను చెక్ చేయాలి. జిల్లాలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. వచ్చే సమావేశంలో తుంగభద్ర బోర్డు అధికారులు కూడా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి. హంద్రీనీవా ద్వారా జిల్లాలో ఉన్న చెరువులను మార్చి నాటికి 90 శాతం నీరు నింపే విధంగా చర్యలు తీసుకున్నాం. 4,5, చెరువుల మాత్రమే మిగిలిపోయాయి. వాటిని త్వరలోనే నింపుతాం. వెల్దుర్తిలో షాదిఖానా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

- ఉదయం జడ్పీ మినీ సమావేశ భవనంలో 1వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. అభివృద్ధికి సంబం ధించి ఆరు అంశాలను తీర్మానించారు. సర్వసభ్య సమావేశంలో 2024-2025 సవరణ బడ్జెట్, 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. జడ్పీ డిప్యూటీ వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీ, ఎంపీపీలు, పరిపాలన అధికారులు జితేంద్ర, మురళీమోహన్‌రెడ్డి, బసవ శేఖర్, సరస్వతమ్మ పాల్గొన్నారు.

కొన్ని మండలాల్లో సమస్య : గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. ప్రధానంగా కల్లూరు మండలం యాపర్ల పాడు గ్రామంలో పైప్‌లైన్ మం జూరు చేయాలి. ఉలింద కొండ, పర్ల, ఎ.గోకులపాడు, తడకనపల్లె గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లె, కొమరోలు, చెన్నంశెట్టి పల్లె, సోమయాజుల పల్లె గ్రామాలలో రవాణా సౌకర్యం కల్పించాలి.

అధ్యాపకుల సంఘం కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఎన్నికల అధికారి మహ్మద్ వాహీద్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా దేవనకొండ జీజేసీ జువాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్న బి.లక్ష్మీనరసింహులు, జేవీ రమణగుప్తను ఉపాధ్యక్షులుగా, కే రామాంజనేయులు సెక్రటరీగా, పి.డేవిడ్‌ను జాయింట్ సెక్రటరీ, ట్రెజరీగా రాహుల్ కుమార్‌ను, మహిళా సెక్రటరీగా ఎస్.రేష్మాతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పి.శ్రీనివాసులు, రవీంద్రబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ అధ్యాపకుల సంక్షేమం, హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధ్యాపక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మద్దికెర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కోదండ రాముడు, వేణమ్మ దంపతుల కుమార్తె కోమలికి, బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన కురువ మునయ్య, తులసమ్మ దంపతుల కుమారుడు భీమశేఖర్‌తో 2020 జూన్ 20వ తేదీన వివాహమైంది. కట్న కానుకల రూ.10 లక్షలు, 15 తులాల బంగారం ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. రెండేళ్ల పాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. అయితే భర్త, అత్తమామలు, తమ్ముళ్లు అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. 2022లో ఓ రాజు రాత్రి భర్త భీమ శేఖర్ కోమలని హతమార్చాలని ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు రక్షించారు. అయితే తమ కొడుకు భీమశేఖర్‌కు దెయ్యం పట్టిందని, అలా ప్రవర్తించాడంటూ నమ్మబలికి పుట్టినిల్లయిన అగ్రహారానికి పంపించారు. పలుసార్లు పంచాయితీలు జరిగినప్పటికీ అదనం కట్నం కోసమే వేధిస్తుండటంతో ఆదివారం మద్దికెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్తతో పాటు అతడి తమ్ముళ్లయిన రాము, సూరి, కుటుంబ సభ్యులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం



మృతదేహం లభ్యమైన బావి ఇదే

ఆస్పరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైనా ఆస్పరిలోని నిత్యం జనాలు తిరిగే గాంధీపార్కు వద్ద ఉన్న పెద్దబావిలో నీరు పూర్తిగా అడుగంటి పోయాయి. ఎవరో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభించింది.. బావి కింద భాగంలో అడుగంటిన నీటిలో మృతదేహం బోర్లపడి ఉంది. అందరూ మృతదేహాన్ని చూసి ఎర్రటి దుస్తులు వేసుకొని వ్యక్తి మృతి చెందాడని అనుకున్నారు. ఆ మృతదేహాన్ని బయటకు తీయడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆదోని నుంచి వచ్చిన వ్యక్తులు బోర్లపడి ఉన్న మృతదేహాన్ని ఆస్పరి సీఐ మస్తాన్ వలి పోలీసులు సమక్షంలో బయటకు తీశారు. తీరా బయటకు తీసిన శవాన్ని మహిళగా గుర్తించారు. ఎర్రటి పంజాబీ డ్రస్సు, చేతులకు గాజులు, కాళ్లకు పట్టీలు ఉన్నాయి. చనిపోయిన మహిళ వయస్సు దాదాపుగా 35 నుంచి 40 వయసు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం దగ్గర జగనన్న కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పశువుల కాపరులు పొలంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్న దృశ్యాన్ని చూసి మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మూడు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తెలిపారు. మృతుడి వయస్సు 30-35 ఏళ్లు ఉండవచ్చని, నల్లటి గళ్లచొక్కా, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నారని చెప్పారు. మృతుడి వద్ద సెల్‌ఫోన్ లభ్యమైనప్పటికీ స్విచ్ఛాఫ్ కావడం, దానికి లాక్ ఉండడంతో ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

కోవెలకుంట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సంజామల మండలం ఆకుమల్లలో ఆదివారం ఉదయం టీడీపీకి చెందిన ఇరువర్గాల ఘర్షణలో దుబ్బా గోవిందరెడ్డి, తిమ్మయ్యతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఆదివారం కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు కార్యాల యంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఒకే పార్టీకి చెందిన దుబ్బా గోవిందరెడ్డి వర్గానికి, మహేశ్వర్‌రెడ్డి వర్గానికి మధ్య గత కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. గ్రామంలో ఏటా నిర్వహించే పుల్లరి విషయంలో విభేదాలు తలెత్తాయి. అంతేకాక సంత మార్కెట్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంతో పాటు గ్రామ సంఘంలో పెద్దమనుషుల నియామకం, పంట కాలువలకు రస్తా విషయంలో వీరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇవి కాస్త పెరిగి పెద్దవి కావడంతో ఇరువర్గాలు ఆదివారం ఉదయం ఘర్షణకు దిగారు. గోవిందరెడ్డి, తిమ్మయ్య వర్గీయులు మహేశ్వర్‌రెడ్డి వర్గంపై దాడి చేశారు. ఈ దాడిలో మహేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి గాయపడడంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దుబ్బ గోవిందరెడ్డి, తిమ్మయ్యతో పాటు మొత్తం ఆరుగురిపై సంజామల పోలీసులు కేసు నమోదు చేశారు. కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు హనుమంతునాయక్, సంజామల ఎస్ఐ రమణయ్య, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దకడుబూరు , మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికనుమ గ్రామ పరిధిలోని ఉన్న పులికనుమ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లివ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివీ.. పులికనుమ గ్రామానికి చెందిన మస్కి నాగేంద్ర శనివారం చేపలవేటకు వెళ్లారు. చేపలుపట్టేందుకు ఒడ్డుపై ఉన్న తెప్పను తిప్పి నీటిలోకి వేశారు. అయితే అది దూరంగా వెళ్లడంతో దాన్ని గట్టుకు తీసుకువచ్చేందుకు నీటిలో దిగి ఈతకొట్టుకుంటూ వెళ్లారు. కొద్దిసేపటికి కనిపించకుండ పోయేసరికి అక్కడే ఉన్న చేపలు ^ఎట్టేవారు గాలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పెద్ద కడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి విచారించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి రామాంజనేయులు సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నారు. నాగేంద్ర కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాసుపత్రిలో శానిటేషన్ ఉద్యోగి మృతి

- మృతదేహంతో కార్మికుల ఆందోళన



కార్మికులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుద్ధ్య కార్మికుడు నగేష్(34) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నగరంలోని బుధవారపేటకు చెందిన నగేష్ ఏవన్ ఏజెన్సీ ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తూ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. క్యాజువాల్టీలో మూడు రోజుల క్రితం చికిత్స తీసుకున్నాడు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై మధ్యాహ్నం 12.46 గంటలకు క్యాజువాల్టీకి వచ్చి మృతి చెందాడు. దీనిపై పారిశుద్ధ్య కార్మికులు, బంధువులు భగ్గుమన్నారు. ఆసుపత్రి పరిపాలన విభాగం ఎదుట మృతదేహంతో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. మృతి చెందిన కార్మికుడికి న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదంటూ బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఘటన స్థలానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు చేరుకొని కార్మికులతో మాట్లాడారు. అంత్యక్రియలకు ఆయన ఆర్థిక సాయం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహంతో మళ్లీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం కార్మికుడు రంగన్న మాట్లాడుతూ పదేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్‌లు కాంట్రాక్టర్ కట్టడం లేదని, ఈఎస్ఐ రూ.3100 కట్టాల్సి ఉండగా.. రూ.450 కడుతున్నారన్నారు.

ఐదు నెలలుగా జీతాలు రాక, ఈఎస్ఐ కార్డు లేకపోవడంతో కార్మికుడు నాగేష్ అనారోగ్యంతో మృతి చెందాడని, అదే ఈఎస్ఐ కార్డు ఉంటే ఈఎస్ఐ హాస్పిటల్‌లో చికిత్స తీసుకునే వాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ కట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే శానిటేషన్ కాంట్రాక్టును రద్దు చేయాలని కోరారు. చివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతినిధిగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోవింద స్వామి సోమవారం కాంట్రాక్టరుతో చర్చలు జరిపిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారని తెలపడంతో మృతదేహాన్ని కార్మికులు, బంధువులు మహాప్రస్థానం వాహనంలో తీసుకుపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు బాషా, నాగార్జున, శివ, నాగన్న, సుజాత పాల్గొన్నారు.

ఎంపీఎం రెడ్డి సేవలను భావితరాలకు తెలియజేయాలి

- అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



మాట్లాడుతున్న అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి చేసిన సేవలను భావితరాలకు తెలియజేయాలని బనగానపల్లెలోని అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు, సాహితీవేత్త బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ జరిగింది. బీసీ రాజారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు కళా స్రవంతి అధ్యక్షుడు ఇనాయతుల్లా, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఎంపీఎం రెడ్డి కుమారుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి, కుమార్తె ఎం. మాలతిలతో కలిసి ఎంపీఎం రెడ్డి చిత్రపటానికి పుష్ప మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా సుద్దమళ్ల గ్రామంలో పుట్టిన ఎంపీఎం రెడ్డి భారతీయ తొలి సముద్ర శాస్త్రవేత్తగా ఎదిగి కెనడా దేశంలో పరిశోధనలు చేశారని గుర్తు చేశారు. సముద్ర శాస్త్రంపై ఆయన రాసిన అనేక పుస్తకాలను నేడు ప్రపంచంలోని అన్ని దేశాల విశ్వ విద్యాలయాలు పాఠ్యాంశాలుగా బోధిస్తున్నాయని, ఇది ఈ జిల్లాకే గర్వకారణమని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు తరిగిపోతున్నాయని, యువత లోకజ్ఞానాన్ని పొందాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ విలువలతో కూడిన జీవితాన్ని ఎంపీఎం రెడ్డి గడిపారని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీఎం రెడ్డి కుమార్తె ఎం. మాలతి, కుమారుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక తండ్రిగా, స్నేహితుడిగా, అన్నింటికీ మించి ఒక గొప్ప గైడ్‌గా తమ జీవితాలను ఆయన చక్కగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఎంపీఎం రెడ్డి ఎక్కడ ఉన్నా తన చుట్టూ మంచి స్నేహితులతో ప్రేమాభిమానాలు పంచుతూ పోయారని, అందుకు ఇలాంటి సభలే నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గజల్ గాయకుడు మహమ్మద్ మియా ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

శ్రీశైలం టోల్‌గేట్ వద్ద మద్యం పట్టివేత



మద్యం, నిందితులతో పోలీసులు

శ్రీశైలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన శివశంకర్ దారెప్ప పాటిల్ (34), ఆనంద్ ముట్వా కాంబ్లే (36) అనే ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తీసుకుని వస్తుండగా శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జి. ప్రసాదరావు, సిబ్బంది రఘునాథుడు, శివమహేందర్ రెడ్డి, మహేష్, అమర్నాథ్‌లతో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 22 టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

ఉగాది సంబరాలకు నంద్యాల కూచిపూడి కళాక్షేత్రం ఎంపిక

నంద్యాల కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్న ఉగాది సంబరాలకు నంద్యాలకు చెందిన సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రాన్ని ఎంపిక చేశారని నిర్వాహకులు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా తన సంస్థకు ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అలాగే తన వద్ద శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు సురేష్ విద్యార్థులతో సంతోషాన్ని వెలిబుచ్చారు. అనంతరం ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కావలెను

ప్రముఖ ఆఫీస్‌లో పని చేయుటకు మహిళ టెలికాలర్స్ కావలెను. జీతం: 15,000/- నుండి 30,000/- వరకు. వివరములకు సంప్రదించండి. సెల్: **98494 57243.**

AJL-229533

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**

AJA- 226978

CHANGE OF NAME

I, **SHILA DEVI** (Old Name) R/o.H.No:87/1101/C1, 4th Class Employees Colony, Kurnool dist, AP., have changed my name as **SHILA SHEEMA TAHIRA** (New Name) W/o.MAHTAB KHAN

AJL-236256

CHANGE OF NAME

I, **LAXMI AVAGHAN PARASHURAM** (Old Name) R/o. H.No: Flat No:303, 43-14-783/11, Uppini Residency, N.R.Peta, Kurnool dist, AP., have changed my name as **MAHENDRAKAR BHAGYA LAKSHMI** (New Name) W/o.Mahendrakar Naga Sayana Rao

AJL-236257

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

దహనక్రియలు , ఉత్తర క్రియలు, శ్రద్ధాంజలి, అశ్రునివాళి, సంతాప, అంత్యక్రియల ప్రకటనలకు

ఆంధ్రజ్యోతి లో ప్రకటనలు ఇవ్వండి

అతి తక్కువ ఖర్చుతో అధిక ప్రచారం పొందండి.





ఆంధ్రజ్యోతి

ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శ్రద్ధాంజలి తెలియజేయండి.

99854 02121

మూల పెద్దమ్మ జాతరను విజయవంతం చేయాలి

● ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 31 నుంచి వచ్చే నెల 30 వరకు జరిగే మూలపెద్దమ్మ జాతరను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దేవదాయశాఖ అధికారులకు సూచించారు. కర్నూలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, గౌరుజనార్దన్‌రెడ్డి ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆలయ ఈవో రామలింగారెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు రమణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, నరేంద్రారెడ్డి, దేవదాయ శాఖ సిబ్బంది రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ నియామకం

గడివేముల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూల పెద్దమ్మ ఆలయంలో ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా 9 మందితో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. ఉగాది బ్రహ్మోత్సవాల వరకు ఉత్సవ కమిటీ ఉంటుందని తెలిపారు. దేశం రమణారెడ్డి, ఆదినారాయణశర్మ, పుల్లమ్మ, లక్ష్మీదేవి, వెంకటమ్మ, సంజమ్మ, గోపాల్, పక్కీరయ్య, చిన్ననాగన్నలు కమిటీ సభ్యులుగా నియమించినట్లు ఈవో చెప్పారు.

ఘనంగా ఉరుసు

మిడుతూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసపేట మజరా గ్రామమైన ఉప్పలదడియలో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్‌షా ఖాద్రి స్వామి ఉరుసును పీఠాధిపతి హజరత్ సయ్యద్ సుభహాన్‌షా ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ ఉరుసు మహోత్సవానికి తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సాయంత్రం ఉరుసు సందర్భంగా భక్తులు స్వామికి జండాలు భక్తిశ్రద్ధలతో ఎక్కించారు. రాత్రి ఉపన్యాసం, ఖవ్వాలిని నిర్వహించారు.

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

కొత్తపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామీణ రహదారులకు మహర్దశ రానుంది. నందికొట్కూరు డివిజన్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) డీఈ రామ్మోహన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదేశాల మేరకు ఆత్మకూరు నుంచి వయా దుద్యాల మీదుగా కొక్కెరంచ గ్రామానికి 13 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పునర్నిర్మాణం కోసం రూ.1.80 కోట్ల నాబార్డు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అలాగే దుద్యాల నుంచి నందికుంట రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షలు, శివపురం నుంచి శివపురం చెంచుగూడెం వరకు రహదారుల మరమ్మతుల కోసం రూ.15 లక్షలు, గువ్వలకుంట్ల నుంచి బండినాయుడుపాలెం వరకు రోడ్డు మరమ్మతులకు రూ.5 లక్షలు, సంగమేశ్వరం వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి సింగరాజనపల్లె గ్రామం వరకు రహదారుల మరమ్మతుల కోసం రూ.4.50 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే సంగమేశ్వరం వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి బడ్వారిపల్లె మరమ్మతులకు రూ.4 లక్షలు, సంగమేశ్వరం మెయిన్ రోడ్డు నుంచి ముసలి మడుగు గ్రామంలోకి రహదారుల మరమ్మతుల కోసం రూ.5 లక్షలు, కొత్తమాడుగుల నుంచి నాగంపల్లి వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.5లక్షలతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారి తెలిపారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలానికి సంబంధించి సోమవారం నుంచి ప్రారంభం కానున్న పది పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎంఈవో-1 బాలాజీనాయక్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 1500 మంది రెగ్యులర్, 271 మంది ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గానూ మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 210 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 170 మంది, పద్మావతి హైస్కూల్‌లో 160 మంది, గౌతమ్ హైస్కూల్‌లో 240 మంది, డీపాల్ హైస్కూల్‌లో 300, శ్రీచైతన్య హైస్కూల్ నందు 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ ఎగ్జామ్ ఆఫీసర్‌లుగా నాగరాజు, గోపాల్, బాలరాజు, నాగమ్మ, నస్రుర్‌ఖాన్, మగ్బుల్‌బాషా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

పాములపాడు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాములపాడులోని ఏఎన్ఆర్ జడ్పీ హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్‌లో 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలకు ఉదయం 9.30 నిమిషాలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు ముగుస్తుందని చెప్పారు.

పగిడ్యాల: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడంతో పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. మండలంలోని పగిడ్యాల, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, లక్ష్మాపురం గురుకుల పాఠశాలలో మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లో లక్ష్మాపురం గురుకుల పాఠశాల, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 160 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్లు తెలిపారు. ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ముచ్చుమర్రి, నెహ్రూనగర్, జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు, గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో పగిడ్యాల జడ్పీ హైస్కూల్, ప్రాతకోట జెడ్పీ పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుతున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ 29 మంది బాధితులకు రూ.32 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఆయను మాట్లాడుతూ అతి కొద్దికాలంలోనే రూ. 76లక్షలు సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ చేసి బాధిత కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

పాములపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలనట్టు గ్రామంలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన అమూల్యరాజ్ కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ టేకూరు రామసుబ్బమ్మ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. టీడీపీ నాయకులు సింగపూరు తెలుగు సమాజం కార్యదర్శి టేకూరు నాగేశ్వరరావు తన తల్లి రామసుబ్బమ్మ ద్వార నగదును పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యరాజ్, ఆల్ఫ్రెడ్, శివకుమార్, హరికృష్ణ, అబ్రహాం, స్వాములు, రాముడునాయక్, భాస్కర్, రాజేష్, యువరాజ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం సొంతం

● పరీక్షల భయం వద్దు ● ఆహార నియమాలు తప్పనిసరి
● నేటి నుంచి 'పది' పరీక్షలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పరీక్షలు వస్తున్నాయంటే అటు విద్యార్థుల్లోనూ... ఇటు వారి తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ మొదలవుతుంది. ఆ ప్రభావం కాస్త వారి శారీరక, మానసిక ఆరోగ్యాల మీదు పడుతుంది. ఎంత బాగా చదివిన పిల్లలైనా వెనుకబడిపోతుంటారు. అతిగా ఆందోళన చెందితే చదివింది కూడా మరిచిపోయే ప్రమాదముందని, మానసిక దృఢత్వం, సమర్థమైన అధ్యయన పద్ధతులు, ధృఢమైన ఆత్మవిశ్వాసం, పరీక్షా విజయాన్ని నిర్ధేశిస్తాయని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు పదో తరగతి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో కొందరు నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



ఆందోళన వద్దు



పరీక్ష పాస్ అవుతామో? లేదో? అన్న ఆందోళన చెందవద్దు. విజయం సాధిస్తా మని గట్టిగా అనుకోవాలి. అతిగా ఆందో ళన పడితే చదువుకున్నది మరిచిపోయే ప్రమాదం ఉంది. మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. సమయాన్ని సమర్థవం తంగా ఉపయోగించుకోవడం, స్టడీ షెడ్యూల్‌ను రూపొందించుకోవడం వల్ల ఒత్తిడిని దూరం చేస్తుంది. మీరు మీ పరీక్షా ఒత్తిడిని అధిగమించలేకపోతే మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియ జేయండి. వారి సలహాలను పాటించండి విజయం మీ సొంతమవుతుంది.

- దండె దస్తగిరి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకుడు

సూచనలు పాటించాలి



విద్యార్థులు ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు ఆయా సబ్జెకును రాస్తూ ప్రాక్టీస్ చేయడం వల్ల మీలో విశ్వాసాన్ని, ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. స్కూల్‌లో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ ముందుకెళ్లాలి. సాధన చేస్తూ ఉంటే ఎంతటి క్లిష్టమైన అంశమైనా సులువుగా గుర్తిండిపోతుంది. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో ఇతర పిల్లలతో పోల్చవద్దు.

- షేక్షావలిరెడ్డి, గురురాజా స్కూల్ కరస్పాండెంట్

జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తీసుకోవాలి. తాజా పండ్లు కూరగాయలతో ఫ్లూయిడ్స్, పాలు తాగాలి. షుగర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోకూడదు. గ్లూకోజ్ ఎక్కువగా ఉత్పత్తి చేసే ఆహారం తీసుకోవడం వల్ల రక్తం మందమవుతుంది. దీనివల్ల బ్రెయిన్ చురుకుదనం తగ్గుతుంది. ప్రొటీన్‌లు ఎక్కువగా ఉన్న బాదంపప్పు, వాల్‌నట్స్ తినడం మంచిది. 8 నుంచి 9గంటలు నిద్రపోవడం చాలా మంచిది. పాలల్లో ఎక్కువగా చెక్కర వేసుకోకుండా తాగడం వల్ల ఉత్తేజకరంగా ఉంటారు. అల్పాహారంలో ఉడికించిన గుడ్డు తినాలి. మైదాతో తయారు చేసిన అల్పాహారం ఇవ్వవద్దు. ఉదయాన్నే పులిహోర, చిత్రాన్నం పెరుగన్నం పెట్టకూడదు. నీటిని తగినంతగా తీసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి మజ్జిగను ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరలు బాగా వాడాలి. గంజి వచ్చిన అన్నం పిల్లలకు ఇవ్వాలి.

- డాక్టర్ తేజశ్విని, డైటీషియన్

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్ తదితరులు

నంద్యాల క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ జి.చంద్రబాబు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆర్ఎస్ఐలు దాదాపీరయ్య, కాళీచరణ్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవనగర్ కూడలిలో వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు బైసాని రామశేషు, సందీప్, పెట్రోల్‌బంక్ శ్రీను, జాగృతిక్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రసిడెంట్ వేణుగోపాల్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపాలిటీ: తెలుగు జాతి ఉన్నంతవరకు పొట్టి శ్రీరాములు జీవించే ఉంటారు ఆయన త్యాగం చిరస్మరణీయం అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సంజీవనగర్ కూడలిలో ఉన్న అమరజీవి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నంద్యాల క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సంజామల మండల కేంద్రానికి చెందిన తలారి రమణమ్మ (65) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా ఆదివారం తెలిపారు. రమణమ్మ, ఆమె భర్త సుబ్బ రాయుడు, అక్క సోకే సుబ్బమ్మ నంద్యాల మండలం కానాల గ్రామంలో వారి ఇంటి నిర్మాణ పనులు పూర్తిచేసుకొని శనివారం రాత్రి పనులు ముగించుకొని రోడ్డుపై నడిచి వెళ్తుండగా వెనుకనుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. రమణమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రమణమ్మ అక్క సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

ఆత్మకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ రాము ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఏపీఎంపాలెం, ఏకలవ్యానగర్ ఏరియాల్లో బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఏటీఎం పాలెంకు చెందిన పీట్ల శ్రీదేవి వద్ద ఈ దాడుల్లో 12 క్వార్టర్ సీసాలు, ఎస్సీజీపాలెంకు చెందిన వడ్డె శివలక్ష్మీ వద్ద 5 మద్యం సీసాల చొప్పున మొత్తం 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

కూలింగ్ మ్యాట్ల ఏర్పాటు

మహానంది, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం కోసం వచ్చే భక్తులు ప్రస్తుతం వేషవికాలంలో భగ భగ మండే సూర్య తాపం నుండి కాస్త ఉపశమనం కోసం మహానంది ఆలయ పరిసరాల్లో కూలింగ్ ప్లాస్టిక్ మ్యాట్లను సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి దాతల సహకారంతో ఏర్పాటు చేయించిన ఎర్రటి మ్యాట్లను ఆదివారం ఆలయ శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డి పారిశుధ్య సిబ్బందితో రుద్రగుండం కోనేరు పరిసరాలతో పాటు క్యూలైన్లు, ప్రధాన రాజగోపురం, యాగశాల పరిసరాల్లో ఏర్పాటు చేసారు.మండు వేషవికాలంలో ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తుల కోసమే ఈ ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

'గిరిజనులకు సాగు భూములు ఇవ్వాలి'

ఆత్మకూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గిరిజన గూడెంకు చెందిన గిరిజనులకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వ్యవసాయ భూములు ఇవ్వాలని సీపీఎం పార్టి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, నరసింహనాయక్ కోరారు.ఆదివారం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా అమలాపురం గిరిజన గూడెంను సందర్శించి అక్కడి చెంచుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..అమలాపురం గూడెంలో 42 కుటుంబాలు గత 25 ఏళ్లగా జీవనం సాగిస్తున్నారనికాగా ఇక్కడి గిరిజనులకు ఇంతవరకు సాగు భూములు లేవని అన్నారు. పాలకులు మారుతున్నా వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. అలాగే గూడెంలో మిని అంగన్ వాడి సెంటర్ ఏర్పాటు చేయాలని, ఇళ్లు లేని గిరిజనులకు పక్కా గృహాలు మంజూరు చేసి ప్రభుత్వమే వాటిని నిర్మించి ఇవ్వాల కోరారు. మల్లికార్జున, గిరిజనులు మూగమ్మ, వెంకటమ్మ, వెంకటేశ్వర్లు, నాగన్న, పెద్దన్న, గురువయ్య పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు: ఎమ్మెల్యే



కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే, అధికారులు

జూపాడుబంగ్లా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అత్యంత ప్రాముఖ్యత, రైతుల జాతరగా పేరుందని, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా సౌకరాలను కల్పిస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని తర్తూరు గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయానికి తాత్కా లిక ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఉత్సవకమిటీ ఛైర్మన్‌గా తరిగోపుల గ్రామానికి చెందిన మందడి నారాయణరెడ్డి, కమిటీ సభ్యులుగా ప్రభావతమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, పరమేశ్వరయ్య, వెంకటసుబ్బమ్మ, సుబ్బన్న ఉత్సవాల నిర్వహణకోసం ప్రభుత్వం తాత్కాలిక కమిటీ నియమించింది. ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో ఈవో వెంకటరమణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం దేవాలయ అధికారులు కమిటీసభ్యులకు, ఎమ్మెల్యేకు పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, దొరబాబు రెడ్డి, వెంకటరమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరతమాత గుడి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వాసవి జాగృతి క్లబ్ నవనంది, నూనెపల్లె పొట్టి శ్రీరాములు క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. జాగృతి క్లబ్ నవనంది ఉమ్మడి జిల్లాల చార్టర్ గవర్నర్ బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా ఆధ్వర్యంలో నూతన చార్టర్ అధ్యక్షుడగా కూరాకు శ్రీనివాస్ దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయగా కార్యదర్శి, కోశాధికారులుగా వల్లం కొండ సుబ్రమణ్యం, ఎలిశెట్టి తేజ ప్రమాణ స్వీకారం చేశారు. కార్య క్రమంలో ముఖ్య అతిథిగా జాగృతి క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ ప్రెసిడెంట్ తిరువీధి వేణుగోపాల్ గౌరవ అతిథిగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఇంటర్నేషనల్ కార్యదర్శి సుంకు చంద్రశేఖర్ గుప్త, గౌరవ అధ్యక్షులు ఖండే శ్యాంసుందర్ లాల్, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, కార్యదర్శి శ్రీనివాస్, భవనాసి నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆర్జీఎం ఎక్స్‌పో'



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద సందడి

పాణ్యం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఎక్స్‌పో 25 ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, విద్యార్థుల నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద ప్రజలు కిక్కిరిసిపోయారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో కళాశాల ప్రాంతం జాతరలా మారింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళాశాల యాజమాన్యం ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. ముగింపు సందర్భంగా ప్రము ఖులు, ప్రజాప్రతినిధులు ఎక్స్‌పో ఉత్సవాలలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఎంతో ఆనందంగా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నపిల్లలకు ప్రత్యేక ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఈఆర్జీఎం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, శాంతిరాం వైద్యశాల ఎండీ రఘురాం, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'గుండ్లకమ్మవాగులో పూడిక తీయాలి'

ఆత్మకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని వరదనీటిని తరలించే గుండ్లకమ్మవాగులో పూడికతీత పనులు చేపట్టి ముంపు కాలనీలకు రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర కోరారు. ఈ సందర్భంగా ఆదివారం సీపీఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా గరీబ్‌నగర్ కాలనీని సందర్శించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, వీరన్న, ఖాస్కర్, సువర్ణమ్మ, కిరణ్, షాలు తదితరులు ఉన్నారు.

'శ్మశానికి స్థలం కేటాయించాలి'

పగిడ్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నెహ్రూనగర్ గ్రామంలో శ్మశానికి స్థలం కేటాయించాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్ సాహెబ్ అన్నారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో సీపీఎం నాయులు ఈశ్వరమ్మ, లక్ష్మన్న, కుమ్మరి ఎర్రన్న, కలిసి ప్రజా చైతన్య యాత్ర పేరుతో సమస్యలను తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. బస్టాండ్ ఆవరణలో బాత్రూంలు లేక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, నాగేష్, మధు, మద్దిలేటి, శాంతన్న, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లేకున్నా బిల్లు..!

● సరఫరా లేకపోయినా మూడు నెలలుగా మినిమం చార్జీ
● ఆందోళనలో గిరిజన గూడేల ప్రజలు
● కరెంట్ కోసం ఎదురుచూపులు



జానాలగూడెం



నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గత 42 సంవత్సరాలుగా చిమ్మచీకటిలో మగ్గిన గిరిజన గూడేలకు ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం కల్పించింది. అయితే.. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రారంభించలేదు. దీంతో ఆయా గూడేల వాసులు రోజు గూడేల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు చూస్తుండటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడేలకు 42 ఏళ్లగా విద్యుత్ సౌకర్యం నోచుకోలేదు. దీంతో ఆ గూడేలకు ఐటీడీఏ అధికారులు ప్రధాన వీదుల్లో సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించారు. అయితే అవికూడా తరుచూ మరమ్మతులకు గురై పని చేయడం లేదు. దీంతో ఆయా గూడేల ప్రజలు చీకట్లోనే జీవనం సాగిస్తున్నారు. ఎట్టకేలకు ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి జన్‌మాన్ పథకం కింద సుమారు రూ.95 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో సంగమేశ్వరం నుంచి సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు 7 కిలోమీటర్ల మేర 272 స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి గత రెండు నెలల క్రితమే ఈ గూడేలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. అయితే నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మూడు నెలల నుంచి గూడేం వాసులు విద్యుత్ వినియోగించుకోకున్నప్పటికీ బిల్లులు మాత్రం విద్యుత్ అధికారులు ఇస్తుండటంతో లబోదిబోమంటున్నారు. నెలకు రూ.150, రూ.35 ఒక్కొక్కరికి ఒక్కో రకంగా బిల్లలు వచ్చాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ప్రత్యేక చొరవ చూపి తక్షణమే విద్యుత్ సౌకర్యం ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఆత్మకూరు విద్యుత్ ఏడీ రామసుబ్రహ్మణ్యంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ గూడేలకు కలెక్టర్ చేతుల మీదుగా విద్యుత్ ప్రారంభించాలనుకున్నామని చెప్పారు. కలెక్టర్‌కు సరైన తేదీలు కుదరకపోవడంతో జాప్యం జరుగుతోందని, త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గతంలో సోలార్ సౌకర్యం ద్వారా గిరిజన గూడేలకు నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం సోలార్ ప్లేట్లు పనిచేయకపోవడంతో విద్యుత్ సరఫరా కావడం లేదు. మోటార్లు కూడా మరమ్మలకు గురయ్యాయి. విద్యుత్ సరఫరా అయితే కనీసం పనిచేసే మోటార్ల ద్వారానైనా నీటి సరఫరా అవుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

విద్యుత్ సరఫరా చేయకుండానే బిల్లు



రెండేళ్ల క్రితం తమ గూడేలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు గానీ, నేటికి విద్యుత్ అధికారులు కరెంటును ప్రారంభించకపోవడంతో చిమ్మచీకటిలో ఉన్నాం. విద్యుత్ ప్రారంభించినప్పటికీ మూడు నెలల నుంచి విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.35 చొప్పున మినిమం బిల్లు వేశారు. ప్రజాప్రతినిదులు, అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

- పసుల వెంకటరమణ, బలపాలతిప్ప

అధికారులు అలసత్వం వీడాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంతో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. ఆదివారం మంత్రి కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీలను స్వయంగా మంత్రి స్వీకరించారు. అక్కడికక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. అర్జీలు స్వీకరించి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొలిమిగుండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి మాతృమూర్తి నంద్యాల రామక్క అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంకిరెడ్డిపల్లెకు చేరుకున్న ఆయన రామక్క చిత్రపటానికి నివాళులర్పించి, నంద్యాల రామేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, ఈశ్వరరెడ్డిలను పరామర్శించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పులి ప్రకాశ్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● **సంజామల:** రామిరెడ్డిపల్లె టీడీపీ సీనియర్ నాయకుడు మంచాల తులసిరెడ్డిని ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల తులసిరెడ్డి సతీమణి రామలక్ష్మమ్మ మృతి చెందడంతో ఆదివారం గ్రామానికి చేరుకొని మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రామిరెడ్డిపల్లెలో మంచాల కుటుంబీకులు సమీప బంధువులు కావడంతో అందరిని కలిసి ముచ్చటించారు. కార్యక్రమంలో మంచాల మద్దిలేటి రెడ్డి, శీలా వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాలకు ఆహ్వానం



ఉత్సవాల ఆహ్వాన పత్రికను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డికి అందిస్తున్న ఈవో

బనగానపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నందవరంలో వెలసిన శక్తిక్షేత్రమైన చౌడేశ్వరీమాత ఆలయంలో నిర్వహించనున్న జ్యోతి మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించనున్న రైతు సంబరాల వేడుకలకు హాజరుకావాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని ఈవో కామేశ్వరీ దేవి ఆహ్వానించారు. ఆదివారం ఆయా కార్యాలయాల్లో వారిని కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు.

హామీలను నెరవేర్చాలి : సీపీఎం

డోన్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కొండపేటలో ప్రజాచైతన్య పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు శివరాం, రామాంజనేయులు, నక్కి హరి పాల్గొన్నారు.

● **వీఆర్వో అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి**

డోన్ వీఆర్వో మల్లారెడ్డి చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉడుములపాడు వీఆర్వోగా ఉన్న మల్లారెడ్డి చుక్కల భూములను రెవెన్యూ రికార్డులలో తారుమారు చేసి అక్రమార్కులకు కట్టబెట్టారని ఆరోపించారు. ఆయన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

'పది' పరీక్షల కేంద్రాల పరిశీలన

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేటి నుంచి పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఆదివారం తెలిపారు. సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.

టీజీపీ మరమ్మతులకు ప్రతిపాదనలు

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని టీజీపీ కాలువ మరమ్మతు పనులు చేసేందుకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 1,400 పనులకు ప్రతిపాదనలు పంపించారని అన్నారు. వీబీఆర్‌లో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఈ ఏడాది టీజీపీ ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించామని అన్నారు. కార్యక్రమంలో టీజీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కాశీం ఆశయ సాధన కోసం పని చేద్దాం

డోన్ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దిగురి కాశీం సాహెబ్ ఆశయ సాధన కోసం పని చేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని షాదీఖానాలో న్యాయవాది కాశీంసాహెబ్ సంస్మరణ సభ నిర్వహించారు. కాశీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెదిరింపులకు భయపడని వ్యక్తి కాశీం సాహెబ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు వలసల రామకృష్ణ, శ్రీరాములు, రంగనాయుడు గార్లపాటి మద్దిలేటి, సోమేష్ యాదవ్, న్యాయవాది నాగభూషణం రెడ్డి, లెనిన్‌బాబు, నబీ రసూల్, కే.రాధాకృష్ణ, వేణుగోపాల్, రాగుల రాముడు, నాగభూషణం రెడ్డి, భాస్కర్ నాయుడు, మహేశ్వరరెడ్డి, నారాయణ బొంతిరాళ్ల సర్పంచ్ న్యాయవాది జే.రవిమోహన్, మద్దయ్య, కుమారి పాల్గొన్నారు.

గుమ్మకొండలో చీని తోట దగ్ధం



చీని తోటలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకొండ గ్రామంలో చీనితోటలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబానికి 12 ఎకరాల చీనితోట ఉన్నది. తోటలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో నాలుగు ఎకరాల చీని తోట అగ్నికి ఆహుతైంది. దీంతో రూ.9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు.

వేసవిలో తాగునీరు అందేనా..?

- రూ.5.10 కోట్లతో హరినగరంలో మంచినీటి పథకం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- రక్షిత మంచినీటి కోసం 41 గ్రామాల ఎదురు చూపులు

రుద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు రుద్రవరం మండలం హరినగరం గ్రామం వద్ద 2009 జనవరి 21న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే గంగుల ప్రతాప్‌రెడ్డి రూ.5.10 కోట్లతో మంచినీటి పథకం ప్రారంభించారు. రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల్లోని 41 గ్రామాలకు రక్షిత మంచినీరు అందించడం లక్ష్యం. 16 ఏళ్లు గడిచినా పూర్తిస్థాయిలో తాగునీరు అందడంలేదు. అధికారుల లెక్కల ప్రకారం 12 గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తున్నామని చెబుతున్నారు. మిగిలిన 29 గ్రామాలకు రక్షిత మంచినీరు అందడంలేదు. అలాగే 2016లో సుమారు మరో రూ.3కోట్లతో ఫేస్-2, ఫేస్-3 కింద ఇక్కడ సంప్, భవనాలు నిర్మించారు. నాటి నుంచి పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజలకు రక్షిత మంచినీరు అందడం లేదు. హరినగరం మంచినీటి పథకాన్ని నిర్లక్ష్యానికి వదిలేశారు. ప్రతి ఏడాది గ్రామీణ ప్రాంత ప్రజలు రక్షిత మంచినీరు కోసం వేసవిలో ఎదురు చూడడం పరిపాటిగా మారింది. అధికారులు మాత్రం వేసవిలో రక్షిత మంచినీటి పనులకు హడావుడి చేసి మళ్లీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారని విమర్శలు ప్రజల్లో ఉన్నాయి.



తిప్పారెడ్డిపల్లె సమీపంలో పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం

ఎప్పుడు సరఫరా చేస్తారు?

తుండ్లవాగు రిజర్వాయరు నుంచి హరినగరం మంచినీటిపథకానికి పైపులైను ద్వారా తాగునీటి సరఫరా కోసం అనుసంధానం చేశారు. ఈ మంచినీటి పథకం లక్ష్యం 41 గ్రామాల ప్రజలకు అందించాలి. అధికారుల లెక్క ప్రకారం 12 గ్రామాలకు నీరు అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ, ప్రస్తుతం ఆరు గ్రామా లకు మాత్రమే నీరు అందుతోంది. అధికా రుల లెక్కతో సరిచూసినా మిగిలిన 29 గ్రామాలకు రక్షిత మంచినీరు ఎప్పుడు అందిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం వేసవిలోనే హడావుడి చేసి వదిలేస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తి చేసి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



హరినగరం మంచినీటి పథకం



ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి లీక్ అవుతున్న నీరు



తుండ్లవాగు నుంచి ఫిల్టరు చేస్తున్న నీరు

12 గ్రామాలకు అందిస్తున్నాం

హరినగరం మంచినీటి పథకం నుంచి 12 గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తున్నాం. పైపులైనుకు తిప్పారెడ్డిపల్లె ప్రాంతంలో మరమ్మతులు చేయిస్తున్నాం. వేసవిలో రుద్రవరానికి రక్షిత మంచినీరు అందిస్తాం. పనులు వేగవంతం చేశాం.

-రమేశ్‌బాబు, ప్రాజెక్టు ఏఈ హరినగరం

30 నుంచి చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరి దేవి ఆలయంలో ఈనెల 30నుంచి ఉగాది బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ, ఆలయకమిటీ మాజీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉగాది బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏప్రిల్ 5వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ వసతులు ఏర్పాటు చేస్తునట్లు ఈవో పేర్కొన్నారు. ఆలయ సమీపంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు ఇవ్వాలని వారు కోరారు.



చౌడేశ్వరి అమ్మవారు



నందవరం ఆలయ గోపురాలు

యేసు మార్గం అనుసరణీయం

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యేసు మార్గం అనుసరణీయమని కర్నూలు జిల్లా బిషప్ గోరంట్ల జాన్వేష్ అన్నారు. ఆదివారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని ఆర్సీఎం చర్చి పునిత జోజప్ప ఆలయంలో ప్రతిష్ఠ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిషప్ చర్చి వద్దకు రాగానే పిల్లలు, పెద్దలు, మహిళలు, ఫాదర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. జపమాల చేస్తూ క్రైస్తవులకు ఆశీర్వచనాలు పలికారు. ప్రేమ, దయా కలిగి ఉండాలని, దైవమార్గంలో నడవాలని బిషప్ కోరారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రకాష్, బాలస్వామి, కరుణాకర్, ప్రసన్న, మిధునారెడ్డి, సిస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఆర్సీఎం చర్చిలో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా బిషప్ గోరంట్ల జాన్వేష్

పొట్టి శ్రీరాములు ఆశయం చిరస్మరణీయం



బనగానపల్లెలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయాలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కోశాధికారి నవతాప్రసాద్ అన్నారు. ఆదివారం చాగలమర్రి గాంధీ సెంటర్‌లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పట్టణంలోని వాసవీభవన్‌లో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీభవనం నుంచి ర్యాలీగా బయలు దేరి పాత బస్టాండ్‌లోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో గాధంశెట్టి వేణుగోపాల్, ఎస్ఆర్‌వి. సుబ్రహ్మణ్యం, గుండా సుప్రజ, బచ్చు విజయ, బచ్చు శరత్‌గుప్త, బలరాం, జక్కానాగరాజు, నూకల విజయకుమార్, గుండారవికుమార్, మురళి, గుండా మురళీధర్, గుండా శ్రీనివాసులు, చిత్తలూరుప్రసాద్, మధుగుప్తా, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్, రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇగ్బాల్ అహ్మద్, కేసీ యాగంటయ్య, రామగోవిందయ్య సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సుబ్బన్న పాల్గొన్నారు.

బేతంచెర్ల : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పట్టణంలో అమ్మవారి శాలలో ఆర్యవైశ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బచ్చు సుబ్రహ్మణ్యం , సుధీర్, సతీష్ కుమార్, శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.



బేతంచెర్లలో..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోటకొండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామంలో గడివేముల నాగసుబ్బయ్య (42) అనే వ్యక్తి శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తన కొడుకు మద్యానికి బానిసై తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఈ అఘాయిత్యానికి పాల్పడి నట్లు ఫిర్యాదులో మృతుడి తల్లి లక్ష్మిదేవి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

బేతంచెర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్.బుక్కాపురం, ఆర్.కొత్తపల్లి గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య ఆదివారం తెలిపారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పప్పు శనగకు మద్దతు ధర రూ.5,650

కొలిమిగుండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పప్పు శనగకు రూ.5650 మద్దతు ధర ప్రకటించినట్లు మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి వెల్లడించారు. శనగ దిగుబడిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తోందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనగ విక్రయం కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో జ్యోతి సూచించారు.

నందవరం ఆలయంలో వేలం

బనగానపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయంలో ఉగాది బ్రహ్మోత్సవాలకు సంబంధించి వేలం నిర్వహించినట్లు ఈవో కామేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ, సప్లయర్స్ హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించామన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీలక్ష్మి టెంట్ హౌస్ వారు విద్యుత్ దీపాలంకరణకు రూ. 1.33 లక్షలకు , సప్లయర్స్ గాను రూ. 1.45లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అడవుల సంరక్షణకు చర్యలు

- శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం



రుద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టినట్లు రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. రుద్రవరం రేంజ్ 42133.96 హెక్టార్లలో విస్తరించి ఉందని, ఐదు సెక్షన్లు, 14 బీట్‌లు ఉన్నాయన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

ప్రశ్న : అగ్నిప్రమాదాల నుంచి అడవుల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు : అడవులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నాం. శాటిలైట్ ద్వారా ముందస్తుగా అగ్నిప్రమాదాల సమాచారం అందుతుంది. అగ్నిప్రమాదాల నివారణకు అడవుల్లో యు లైన్లు, ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశాం. స్వచ్ఛసేవకులు , ప్రొటెక్షన్ వాచర్లు, ఫారెస్టు సిబ్బందిని అప్రమత్తం చేసి నివారిస్తాం. పది క్లాస్ కట్టర్లు, మరో పది బ్లోయర్లు మంటలను అదుపు చేసేందుకు ఉపయోగిస్తున్నాం.

ప్రశ్న : ఇప్పటి వరకు ఎన్ని అగ్ని ప్రమాదాలు గుర్తించారు

జవాబు : రుద్రవరం రేంజ్‌లో ఇప్పటి వరకు 110 అగ్ని ప్రమాదాలు గుర్తించాం, సకాలంలో స్పందించి మంటలు ఆర్పుతున్నాం. అటవీ సరిహద్దుల్లో కందకాలు తవ్వించాం, కందకాలు తవ్వడంతో బయటి నుంచి వచ్చే అగ్ని ప్రమాదం అక్కడే ఆగిపోతుంది.

ప్రశ్న : వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు : రేంజ్ పరిధిలో 29 సాసర్‌పిట్లు ఉన్నాయి. ట్యాంకర్లతో వాటిల్లో నీరు నింపుతున్నాం. మరో తొమ్మిది పారంపండ్లు తవ్వించి వన్యప్రాణులకు దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న : అడవుల సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారా?

జవాబు : ప్రజలను భాగస్వాములను చేస్తున్నాం. గ్రామాల్లో కళాజాత నిర్వహిస్తూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : అడవిలో వన్యప్రాణుల సంఖ్య పెరిగిందా?

జవాబు : అడవిలో వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. పెద్దపులి నుంచి జింకల వరకు వన్యప్రాణులు పెరిగాయి.

ప్రశ్న : రేంజ్‌లో సిబ్బంది కొరత ఉందా?

జవాబు : రేంజ్‌లో సిబ్బంది కొరత 50శాతం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సిబ్బంది కొరత తీరనుంది.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ప్యాపిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న రాచెర్ల, బోంచెర్వుపల్లి గ్రామాలకు ఆదివారం నుంచి అధికారులు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. రాచెర్లకు ఎనిమిది ట్యాంకర్లు, బోంచెర్వుపల్లికు నాలుగు ట్యాంకర్ల చొప్పున రోజు సరఫరా చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. గ్రామాల్లో బోర్లు అడుగంటిపోవడంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు.

నేడు పంచాయతీ వేలాలు

ప్యాపిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజరు గ్రామ పంచాయతీ సంబంధించిన వేలాలు సోమవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ అధికారి శివకుమార్ ఆదివారం తెలిపారు. సంత మార్కెట్, డైయిలీ మార్కెట్, బస్టాండ్, కబేళాకు సంబంధించి వేలా లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలందారులు పంచాయతీ నిర్ణయించిన రూ.ఎనిమిది లక్షల డిపాజిట్‌ను చెల్లించి పాల్గొనాలని ఆయన తెలిపారు.

'పది' పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

ప్యాపిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాపిలి, జలదుర్గం, పోతుదొడ్డి, రాచెర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. కేంద్రాల వద్ద గుంపులుగుంపులుగా తిరిగితే శాఖపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో మొత్తం 752 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

ఘనంగా జియారత్

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలసిన జమాల్‌వలిస్వామి జియారత్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన పిల్లలు, పెద్దలు, మహిళలు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. దర్గా మేనేజింగ్ డైరెక్టర్లు పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక దీపోత్సవం

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో ఆదివారం మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో ప్రవచనాలు, శివ అపరాధ స్తోత్రములు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నర్సరీ ఏర్పాటుకు చర్యలు

రుద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలం నరసాపురం రెవెన్యూ పరిధిలోని హరినగరం సమీపంలో ఉద్యాన నర్సరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. ఉద్యాన నర్సరీ ఏర్పాటు గురించి సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టరు రాజకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకెళ్లారు. దాంతో ఆయన స్పందించి నర్సరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. 2006 నవంబరు 10న అప్పటి కలెక్టరు కిశోర్, ఎమ్మెల్యే గంగుల ప్రతాప్‌రెడ్డి భూమిపూజ చేసి శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదు. పనులు పెండింగ్‌లో పడ్డాయి. సీఎం స్పందించడంతో పండ్లమొక్కలు ఇక అందుబాటులో ఉంటాయని నల్లమల తీర రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

శెట్టివీడులో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో రూ.10 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. దాతల సహకారంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు పనులు వేగవంతం చేస్తున్నట్లు నిర్వాహకుడు నర్సయ్య తెలిపారు. గోశాల షెడ్డు కూడా ఏర్పాటు చేస్తున్నామ న్నారు. వీరమ్మ జ్ఞాపకార్థం భక్తులకు నీటి సౌ కర్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి పనులు చేపడతామని నిర్వాహకులు నర్సయ్య తెలిపారు.

'ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగలేదు'

చాగలమర్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగలేదని కళాశాల కరస్పాండెంట్ రమణగుప్త, కార్యదర్శి పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మాస్ కాపింగ్ జరిపినట్లు వచ్చిన ఆరోపణలను ఖండించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వీడియో వైరల్‌గా మారిందన్న విషయం అవాస్తవమన్నారు.